




ఆక్స్ ఫర్డ్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ కూటమి ఎంఎల్ఏగా ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజారిటీ సాధించి గెలుపొందిన సందర్భంగా కూటమి ముఖ్య నాయకులు, బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు నేతృత్వంలో శుక్రవారం పట్టణంలోని కార్యకర్తలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.అనంతరం నాగేశ్వరరావుని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించిన సందర్భంగా కొండికందుకూరు గ్రామ పంచాయతీ, బొడపాటి వారి కోష్ఠాలు గ్రామ మహిళా టీడీపీ నాయకులు ఈదర అరుణ ఆధ్వర్యంలో మాలకొండ లోని లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా బయల్దేరారు. ఈ పాదయాత్రలో గ్రామ టీడీపీ నాయకులు ఈదర పెద నరసయ్య,ఈదర చెంచురామయ్య, బొడపాటి సుధాకర్, బొడపాటి సుబ్బారావు, మహేంద్ర, భక్తుమంతుల మాల్యాద్రి, నల్లమోతు సురేష్, కర్ర మల్లికార్జున, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తప్పు వైసిపిదా..ఓటర్లదా..!

ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి డబ్బులిస్తే మాకు ఓట్లు పడలేదు. ఎందుకిలా జరిగిందని స్వయంగా ఆపార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆపార్టీ నేతల వద్ద వాపోయినట్లు తెలిసిందే. ఓటర్లు వైసిపిని మళ్లీ ప్రజలు ఎందుకు తిరస్కరించారో తెలుసుకొని అందుకు అనుగుణంగా ఆపార్టీ మార్పు చెందాల్సింది. ఓటర్లపై నెపంనెట్టేసి వైసిపి నేతలు చేతులు దులుపుకుంటున్నారు. ఐదేళ్ల జిల్లాలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే క్రమంలో అభివృద్ధి జోలికి వెళ్లలేదు. ప్రతిపక్షాలపై విమర్శలు, గ్రావెల్, ఇసుక, రియల్ ఎస్టేట్ దందా, తెల్లరాయి, సిలికా, అక్రమార్కులు, కొందరు ఎంఎల్ఏలు కోట్లకు కోట్లు దోపిడీ, ఏ ప్రభుత్వ శాఖ సరైన మార్గంలో పనిచేయకపోవడం వంటిని వైసిపిని వ్యతిరేకంగా తెలుస్తోంది. ఈ విషయం పక్కన పెట్టి అధికారులు, ఓటర్లపై నిందలేస్తున్నారనే విమర్శలున్నాయి..

- వైసిపి నేతల సమీక్ష తూతూ మంత్రం
- టిడిపి, వైసిపిల మధ్య 2.18 లక్షల ఓట్లే తేడా
- 5.34 లక్షల మంది వైసిపికి ఓట్లేశారు.
- అభివృద్ధిని మరిచారు..అరుపులతో కాలం గడిపారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాజకీయపార్టీలకు తమ ఐదేళ్లపాలనే రెఫరెండంగా ప్రజలు ముందుకెళుతున్నారు. ఆ పరిస్థితులను బట్టి ఆయా పార్టీలు తమ విధానాలు మార్చుకుంటాయి. 2014 టిడిపి 2019 వైసిపి, 2024 టిడిపిలు గెలిచాయంటే ప్రజలను అనుకూలంగా పనిచేయలేదనే తెలుస్తున్నాయి. 2019 ఎన్నికల్లో జిల్లా చరిత్రలో ఏ పార్టీకి దక్కని గౌరవం వైసిపికి దక్కింది. జిల్లాలో 99 శాతం పదవులు ఆపార్టీకి వరించాయి. నెల్లూరు జిల్లాలో ఇద్దరు ఎంపిలు, 10 మంది ఎంఎల్ఏలు, 46 మంది ఎంపిపి, 46 మంది జెడ్పిటిసి, జెడ్పి చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, 960 మంది సర్పంచ్‌లు, 8450 మంది వార్డు మెంబర్లు, 530 మంది ఎంపిటిసిలు ఇలా షుమారు 10 వేల మంది ప్రజా ప్రతినిధులుగా వైసిపికి చెందిన వ్యక్తులు అధికారంలోకి వచ్చారు. అలాంటి ఇప్పుడు ఇప్పుడు ఒక్కసారిగా ఘోరంగా విఫలమైంది. ఉమ్మడి జిల్లాలో 10కి 10స్థానాలు టిడిపి గెలుచుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో టిడిపి ప్రజా ఉద్యమాలు పెద్దగా నిర్వహించలేదు. ప్రజల తరుపున పోరాటం చేయలేదు. ఇప్పుడు పోటి చేసిన అభ్యర్థులు ఒకరో ఇద్దరు తప్ప అంతా కొత్తవారే. అలాంటిప్పుడు ఓటర్లు ఎందుకు ఆపార్టీకి అంత పెద్ద ఓట్లు వేశారో వైసిపి నేతలు సమీక్షించుకోవడం





ఓటేసేందుకు వెళుతున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

లేదు. తాము అంతా బాగా చేశామని ప్రజలు తమకు ఓట్లు వేయడం లేదంటూ సమీక్షించుకుంటున్నారు. జిల్లా నెల్లూరు పార్లమెంట్ పరిధిలో టిడిపికి 7,52,753 ఓట్లు, వైసిపికి 5,34,186 ఓట్లు వచ్చాయి. కేవలం 2,18,565 ఓట్లు మాత్రమే తేడాగా ఉంది.ఉద్యోగస్తులంతా వైసిపికి వ్యతిరేకంగా పనిచేశారని చెబుతోన్న వైసిపి నేతలకు అసలు విషయం తెలియడం లేదు. పార్లమెంట్ పరిధిలో 15,057 ఓట్లు టిడిపికి వస్తే, 6410 ఓట్లు వైసిపికి వచ్చాయి. సుమారు 40 శాతం మంది పోస్టల్ ఓట్లు వైసిపికి పడ్డాయి..

సంక్షేమం సరే..అభివృద్ధి ఏదీ..?

వైసిపి ప్రభుత్వం సక్షేమం పెద్ద ఎత్తున చేశామని చెబుతోంది. ఇదే క్రమంలో అభివృద్ధి విషయంలో నోరు మెదపడం లేదు. సంక్షేమ పథకాలు అనేక ప్రభుత్వాలు చేపట్టాయి. వైసిపి వచ్చాక అమ్మఒడి మాత్రమే ప్రత్యేకంగా తీసుకొచ్చింది. స్కాలర్ షిప్‌ల రూపంలో విద్యార్థులు నగదు వస్తుండగా దాని స్థానంలోనే జిల్లా వ్యాపితంగా ప్రతేడాది 3.15 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు.రైతు భరోసా, చేయూత, జగనన్న కానుక వంటికి చేపట్టారు. జిల్లాలో అభివృద్ధి జాడ కనిపించలేదు. ఎన్‌టిఆర్ హౌసింగ్ ద్వార 43 వేల అపార్ట్‌మెంట్ ఇళ్లు కడితే లబ్ధిదారుకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. రోడ్లు మొత్తం గుంతలమయం. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర నాలుగేళ్ల కల్పించలేదు. ఉద్యోగం, ఉపాధి కల్పన ఊసేలేదు. ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయి. గతంలో యువత, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ జనం వైసిపి వెంట నడిచారు. ఈ ఎన్నికల్లో వీరంతా వైసిపికి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు కనిపిస్తోంది.కొందరు ప్రజా ప్రతినిధుల తాము చేసిన అభివృద్ధిని ఏ రోజు ప్రజలకు తెలియజేయలేదు. కేవలం ప్రతిపక్ష పార్టీలను తిట్టడానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఏ ఒక్క శాఖలోనూ వైసిపి నేతల పెత్తనం లేకుండా సాగలేదనే విమర్శలు మూటకట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే వైసిపిని ప్రజలు వ్యతిరేకించారని తెలుస్తోంది. అది కొద్ది మంది మాత్రమే. ఆపార్టీకి చెందిన కార్యకర్తలు, ఓటర్లు, సాధరణ ప్రజలు ఆపార్టీకి ఓట్లు వేశారని ఓట్లు శాతం పట్టి తెలుస్తోంది. తప్పులను సరిచేసుకోవాల్సిన పార్టీ నేతలు తాము అంతా బాగున్నామని, ప్రజలు తప్పుచేశారని తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తూతూ మంత్రంగా సమీక్షలు చేస్తున్నారు. ఆత్మవిమర్శపూర్వకంగా సమీక్ష నిర్వహిస్తేనే ఉపయోగం తప్ప ఇలా కాందంటూ కొందరు పెదవి విరుస్తున్నారు.

ఫైనాపురంలో విజృంభిస్తున్న అతిసార..



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు



మృతురాలు కావలి రమణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం, ఫైనాపురం ప్రాంతంలో తాగునీరో లేదా వాతావరణం కలుషితమైందో..పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించిందో తెలీదు కాని ఆ ప్రాంతానికి చెందిన పలువురు అతిసార భారిన పడ్డారు. సుమారు 20 మంది వాంతులు..విరోచనాలతో వైద్య చికిత్సల నిమిత్తం నెల్లూరు నగరంలోని ప్రభుత్వ, పలు ప్రయివేట్ వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. ఫైనాపురం ప్రాంతంలోని దళిత వాడ, గిరిజన ప్రాంతాల్లో అతిసార వ్యాధి విజృంభించింది. గడిచిన మూడు రోజుల నుంచి అతిసార ఆ ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తుంది. శుక్రవారం నాటికి ఆ గ్రామం నుంచి సుమారు 20 మంది అతిసార వ్యాధితో బాధపడుతూ వైద్యచికిత్సల నిమిత్తం ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఈ వ్యాధి తీవ్రరూపం దాల్చడంతో జిజిహెచ్, డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు నగరంలోని పలు ప్రముఖ ప్రయివేట్ కార్పొరేట్ వైద్యశాలల్లో బాధితులు చికిత్సలు పొందుతున్నారు. ముత్తుకూరు మండల పరిధిలోని పలు ప్రయివేట్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాల వల్ల గాలి, నీరు, వాతావరణం కలుషితం కావడం కారణంగా అతిసార వ్యాధి ప్రబలిందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఫైనాపురం ప్రాంతాన్ని సందర్శించి వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి పరిస్థితిని చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. పంచాయతీ శాఖ అధికారులు ఆగ్రామంలోని పరసరాలను పరిశుభ్రపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కావలి రమణమ్మ అనే మహిళా అతిసార వ్యాధితో జిజిహెచ్‌లో చికిత్సలు పొందుతూ మృతిచెందిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం అతిసార వ్యాధి వల్ల జిజిహెచ్‌లో మృతి చెందలేదని, కార్డియాక్ అరెస్టు కారణంగా చనిపోయిందని డాక్టర్లు ప్రకటించారు.

బాధితులకు సిపిఎం పరామర్శ

ఫైనాపురం ప్రాంతంలో అతిసార వ్యాధికి గురై డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో వైద్య చికిత్సలు పొందుతున్న బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ముత్తుకూరు మండలం సిపిఎం శాఖ నాయకులు గోగుల శ్రీనివాసులు పరామర్శించారు. సిపిఎం జిల్లా నాయకులు ముందుగా డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు బి.రాజరాజేశ్వరరావుతో మాట్లాడి అతిసార వ్యాధికి గురై చికిత్సలు పొందుతున్న వారికి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన 20 మంది అతిసార వ్యాధికి గురై నగరంలో పలు ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొందుతున్నారన్నారు. ఈ వ్యాధితో బాధపడుతూ జిజిహెచ్‌లో చికిత్సలు పొందుతూ గురువారం రాత్రి రమణమ్మ అనే మహిళ మృతి చెందడం బాధకరమన్నారు. అతిసార వ్యాధితో వైద్యచికిత్సలు పొందుతూ మహిళ కన్ను మూయడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. అధికారులు ఈ ప్రాంతంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందజేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాల వల్ల వాతావరణ కాలుష్యం కారణంగా ఇటువంటి పరిస్థితులు ఎర్పడడం బాధాకరమన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో కాలుష్య నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కరోనరీ డెత్

ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టరు ఖాదరువలి

ఫైనాపురం ప్రాంతానికి చెందిన మహిళ మృతి చెందినది అతిసార వ్యాధి వల్ల కాదని, కరోనరీ డెత్ అని జిజిహెచ్ వైద్యాధికారులు నిర్ధారించారని ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టరు ఖాదరు వలి అన్నారు. గుండెకు సంబంధించిన సమస్యతో వైద్య చికిత్సల నిమిత్తం జిజిహెచ్‌లో చేరారన్నారు.జిజిహెచ్‌లో వైద్య చికిత్సల నిమిత్తం చేరిన ఇద్దరి మహిళల పేర్లు ఒకటే కావడంతో సిబ్బంది కన్‌ఫ్యూజ్ కావడంతో అతిసార వల్ల మృతి చెందినట్లు ప్రకటించామని, నిజానికి ఆమరణం కరోనరీ డెత్‌గా జిజిహెచ్ అధికారులు ధృవీకరించారన్నారు.

ముత్తుకూరు మండలం, ఫైనాపురం గ్రామంలో డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సీనియర్ డాక్టర్ శీను నాయక్ , జనవిజ్ఞాన వేదిక హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ గ్రామంలో పర్యటించి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి తగు సూచనలు సలహాలిచ్చారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ భాస్కర్, కష్ణారెడ్డి, జిల్లా నాయకులు మాదాల రాము విజయకుమార్, మోహన్ రెడ్డి, స్థానిక సిఐటియు నాయకులు గడ్డం అంకయ్య, నజీర్ బాషా, జయరామయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు

చిరువ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

పేదల కష్టాలను చూశానని...నిరుపేద ప్రజల జీవనోపాధులు మెరుగుపరచడంతో పాటు నెల్లూరు అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు గోమతినగర్ నారాయణ క్యాంప్ కార్యాలయంలో 18 మంది చిరువ్యాపారులకు టీడీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఆయన తోపుడుబండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమపై, పార్టీపై నమ్మకంతో అత్యధిక మెజార్టీ అందించారని ప్రజల రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయడమే పార్టీ సిద్ధాంతమే తన ధ్యేయమన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో తాను పర్యటన చేపట్టిన సమయంలో ప్రజల సమస్యలను దగ్గర నుంచి చూశానన్నారు. వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గెలిచిన మరుక్షణం నుంచే ముందడుగు వేస్తున్నట్లు తెలియజేశారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో 94 వేల నివాసాలు ఉండగా దాదాపు 80 వేల ఇళ్లను స్వయంగా పరిశీలించానని చెప్పారు. ఈ సమయంలో కొందరు చిరువ్యాపారులు తమ బాధలను తెలియజేస్తూ... తోపుడుబండ్లపై ఆధారపడి బతికే తాము అధిక వ్యయానికి బండ్లు తీసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బండ్లు ఇస్తే కొంతమేర ఆదారంగా ఉంటాయని, వారి జీవనోపాధి కోసం తోపుడుబండ్లు అడిగారన్నారు. వారి కోరిక మేరకు ప్రస్తుతం 18 తోపుడుబండ్లను చిరువ్యాపారులకు అందజేసి వారి జీవనోపాధులు మెరుగుపడేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్‌కు ముందుకు 150 తోపుడుబండ్లు ఇచ్చామని, అనంతరం మరో 200 బండ్లు అడిగారన్నారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్‌పిటిసి విజేతరెడ్డి, నగర అధ్యక్షులు మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ

జనసేన గెలుపుపై అంగులూరి హర్షం

ప్రజాశక్తి - లింగసముద్రం

సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అనూహ్య ఫలితాలను సాధించడంపై ఆ పార్టీ మండల అధ్యక్షులు అంగులూరి నరసింహారావు సంతోషం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి పార్టీ బలోపేతానికి కృషిచేసి నిరంతరం నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వచ్చారు.అరాచక పాలన సాగనంపాలని కూటమికి నాంది పలికిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు వేయకుండా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేశారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకీ సాధ్యపడని విధంగా నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన ఘనత జనసేన పార్టీకి దక్కుతుందన్నారు. అదేవిధంగా కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు నాగేశ్వరరావు గెలుపునకు మండలంలో జనసైనికులు బాగా పని చేశారన్నారు.ముఖ్యంగా లింగసముద్రం పంచాయతీలో ఎక్కువ మెజార్టీ రావడానికి జనసైనికుల కృషి ప్రశంసనీయమన్నారు. ఇదే విధంగా ఇదే ఉత్సాహంతో ఐదు సంవత్సరాలు ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేసి ప్రజలకు దగ్గర ప్రయత్నం చేస్తామన్నారు. జనసేన తెలుగుదేశం, బిజెపిలను సమన్వయపరిచి విజయం సాధించిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు.





ఆర్‌టిసి -2 డిపో ఎదుట ఆందోళన


ప్రజాశక్తి-నెల్లూరు

ఓ దిన పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకొని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్యపై ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పేరుతో అక్రమంగా సస్పెన్షన్ చేయడం దారుణమంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు నగరంలోని ఆర్‌టిసి -2 డిపో ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం నగరంలోని ఆర్‌టిసి -2 డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి కె. చంద్రయ్య ఆధ్వర్యంలో పలువురు ఆర్‌టిసి కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఇంటూరిని కలిసిన 'రాజారపు'

ప్రజాశక్తి -లింగసముద్రం

కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులుగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఇంటూరి నాగేశ్వరరావుకు యర్రారెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. బడేవారిపాలెంలోని ఇంటూరి నాగేశ్వరరావును కలిసి శాలువాతో సత్కరించి, బోకే అందజేశారు. తన విజయం కోసం కృషిచేసిన మాలకొండయ్యను అభినందించారు. ఈసందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు.20 సంవత్సరాల తర్వాత కందుకూరులో తెలుగుదేశం పార్టీ గెలవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు.



ఇంటూరిని సన్మానిస్తున్న రాజారపు

'ఇంటూరి'కి ఘన స్వాగతం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని లింగపాలెంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావుకు శుక్రవారం గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలోకి నాగేశ్వరావు రాగానే గ్రామస్తులు ఎదురొడ్డి ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామంలోని ప్రధాన రహదారులలో ఊరేగింపు చేశారు. గ్రామ మంతా పసుపుమయమైంది. నాగేశ్వరావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో హోరెత్తింది. మహిళలు అడుగుడునా నాగేశ్వరావుపై పూలవర్షం కురిపించారు. అనంతరం నాగేశ్వరావు కేక్ కట్ చేసి కార్యకర్తలతో కలిసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.రెండు దశాబ్దాల కల నెరవేరిందంటూ ఆనందంతో టిడిపి నాయకులు మురిసిపోయారు. చంద్రబాబు సారధ్యంలో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.నాగేశ్వరరావుపై మహిళలు పూలు చల్లుతూ, హారతులతో స్వాగతం పలికారు.గ్రామస్తుల ఆత్మీయ స్వాగతానికి ధన్యవాదాలు. మీ సహకారం ఎప్పటికీ మరిచిపోనని తెలిపారు. గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి మాధవ, శ్రీను వడ్లమూడి శ్రీను, కాకుమాని ఆంజనేయులు, కాకుమాని హర్ష, వలేటి మధుసూదన్, పరిటాల భాస్కర్ , తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

టిడిపి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- లింగసముద్రం

తెలుగుదేశం పార్టీ భారీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు లింగసముద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు పంచాయతీలోని గోపాల్ నగర్ నుండి లింగసముద్రం ప్రధాన రహదారి తో పాటు కోటయ్య సమాధి సెంటర్ లో డీజే ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు.ముఖ్యంగా తెలుగుదేశం జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.కందుకూరు నియోజకవర్గం లో 20 సంవత్సరాల తర్వాత ఇంటూరి నాగేశ్వరరావు శాసనసభ్యులుగా గెలుపొంది తెలుగుదేశం జెండా ఎగరడంతో ఆనందోత్సవాల్లో టిడిపి శ్రేణులు ఉన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు కడప రంగయ్య, టిడిపి, జనసేన నాయకులు అర్ధాకుల పెద్ద సత్యం, కిలారి రమణయ్య, ఎస్.మహేష్, లారీవిష్ణు, యశ్వంత్, రాఖి, తిరుమలశెట్టి గోపి, రవీంద్ర, బొజ్జ సాయి, నవీన్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు రూ.300 ఇవ్వాలి

ప్రజాశక్తి-మనుబోలు: మండలం, మడవనూరు బద్దెవోలు గ్రామాలలో జరుగుతోన్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో కనీస కూలి 300 రూపాయలు ఇవ్వాలని చట్టం చెబుతున్న కూలీలకు మాత్రం ఇప్పటికే రూ.250, రూ.200 ఇచ్చే పరిస్థితి ఉందన్నారు. దీన్ని పరిశీలించి అధికారులు కూలీలకు 300 రూపాయలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, మెడికల్ కిట్టు లాంటి వసతులు కల్పించాలన్నారు.కార్యక్రమంలో వ్య.కా.స. మండల కార్యదర్శి బిసి భాస్కర్, మండల అధ్యక్షులు తలారి దేవదానం, నాయకులు నరసయ్య, చేతి వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ కటికల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.దువ్వూరులో ఉపాధి హామీ కూలీల పరిస్థితులను వ్య.కా.స.జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు అడిగి తెలుసుకున్నారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు: ఆకాశం మేఘవతమై మబ్బులు కమ్ముకొని ఉన్నాయి. అందులో భాగంగా ఉరుములు మెరుపులు రావడంతో అకస్మాత్తుగా పిడుగు పడింది. పిడుగుపాటుకు గురై నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలోని యర్రంరెడ్డి పల్లి గ్రామంలో నాదెండ్ల రవీంద్రబాబు (30) మతి చెందాడు. అతను పొలం నుంచి పసులకు మేత తీసుకొస్తుండగా ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. ఎస్ఐ కె.తిరుపతయ్య సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన తీరుపై వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా నిమిత్తం ఉదయగిరి కి తరలించారు. మతుడికి భార్య కళావతి, ఏడేళ్ల కుమార్తె ప్రభావతి ఉన్నారు.

అధికారులతో గిరిధర్ రెడ్డి భేటి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ:: ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ తో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఎస్పి కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పలు విషయాలను వారు మాట్లాడుకున్నారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో భేటి అయ్యారు.కార్యక్రమంలో టిడిపి నేతలు దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, మదన్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అరవ శీను, శివయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటూరి'ని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలో బడేవారిపాలెంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని వలేటివారిపాలెం తెలుగుదేశం శ్రేణులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుకు శాలువా పూల బొకేతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధుసూదన్ రావు, కాకుమాని హర్ష, వల్లేటి నరసింహ, కాకుమానీ మాల్యాద్రి, కాకుమాని ఆంజనేయులు, మహేశ్వరరావు, కొంక రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలపై న్యాయవిచారణ జరపాలి

ప్రజాశక్తి-నెల్లూరు

గత ప్రభుత్వం హయాంలో ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు తెరదించి, దానికి కారణమైన రాజకీయ నాయకులు విద్యాశాఖలోని ఉన్నతాధికారులపై న్యాయ విచారణ జరిపించాలని పిఆర్‌టియు జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరాజు, నాటకం తిరుమలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో దాదాపు 1200 మంది ఉపాధ్యాయులను అక్రమంగా దొడ్డిదారిన ఇప్పటి మాజీ అప్పటి విద్యాశాఖ మాత్యులు, రాష్టంలోని ఇద్దరు విద్యాశాఖలోని ఉన్నత అధికారులు కలిసి కొంతమంది దళారుల ద్వారా బదిలీలు చేశారన్నారు. ఈ వ్యవహారంలో లబ్ధిపొందిన ప్రతి ఉపాధ్యాయుని నుంచి సరాసరిన రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు(దాదాపు 50 కోట్ల రూపాయలు)వసూల్ చేసి చట్టానికి వ్యతిరేకంగా బదిలీలు చేసినట్లు కథనాలు సైతం ప్రచురితం అయ్యాయన్నారు.ఒకే తప్పునకు దళితులకు ఒక న్యాయం దళితేతరులకు మరొక న్యాయం కాకుండా కొత్తగా ఏర్పడే ప్రభుత్వం సమగ్రమైన న్యాయ విచారణ జరిపి సంబంధిత ప్రజాప్రతినిధులు, విద్యాశాఖలోని ఉన్నత అధికారులపై కఠినచర్యలు తీసుకొని ఆర్థికంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు సరైన న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో చిరువ్యాపారి మృతి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక ముత్తుకూరు గేట్ సెంటర్‌లో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుడు, చిరు వ్యాపారి ఎర్రబెల్లి మోహన్ (35) మృతి చెందారు. ప్రతి రోజులానే వ్యాపారం చేసుకుంటూ తోటి వ్యాపారస్తులతో ఆనందంగా అప్పటి వరకు గడిపాడు. రోడ్డుకు అటుపక్కకు వచ్చి తిరిగి తన దుకాణం చేరుకొనే క్రమంలో రోడ్డు దాటుతూ డివైడర్ ను పట్టుకోవడంతో కరెంటు షాక్ కొట్టింది. దీంతో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. అప్పటి వరకు ఎంతో సంతోషంగా తమ మధ్య తిరుగుతూ ఉన్న వ్యక్తి అందరూ చూస్తుండగానే విద్యుత్ షాక్‌కు గరై మరణించడం విస్మయానికి గురిచేసింది. సమాచారం తెలుసుకున్న సిపిఎం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన ప్రమాదానికి గురైన సంఘటనపై విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో బాధితుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-కందుకూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్)కందుకూరు డివిజన్ ఆధ్వర్యంలో దాచూరి కందుకూకు రామిరెడ్డి విజ్ఞాన్ భవన్‌లో డివిజన్లోని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థుల అభినందన కార్యక్రమం శుక్రవారం యు.టి.ఎఫ్ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విలువైన సూచనలు చేశారు. ఇష్టమైన కోర్సులు ఎంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. ఉన్నతంగా కలలుగని వాటిని సాకారం చేసుకొని మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలలకు మంచి పేరు తేవాలని చెప్పారు. అనంతరం 40 మంది విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను శాలువాతో సత్కరించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.వి చలపతి శర్మ, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు, కందుకూరు మండల విద్యాశాఖ అధికారి కె.వి సుబ్బారెడ్డి, వివి పాలెం, లింగసముద్రం, విద్యాశాఖ అధికారి కె.రవికుమార్, పొన్నలూరు విద్యాశాఖ అధికారి రవిచంద్రబాబు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

'ఆనం'ను కలిసిన యుటిఎఫ్ నాయకులు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులుగా నూతనంగా ఎన్నికైన ఆనం రామనారాయణ రెడ్డిని శుక్రవారం చేజర్ల మండలం యుటిఎఫ్ నాయకులు ఆనం రామనారాయణరెడ్డి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆనం రామనారాయణ రెడ్డిని శాలువాతో సన్మానం చేశారు. ఆయనను అభినందించారు.

వైసిపి నాయకులు రాజకీయ సన్యాసం చేయాలి



ప్రజాశక్తి-బిట్రగుంట : సార్వత్రిక ఎన్నికల సమయంలో బోగోలు మండలం వైసిపి నాయకులు మండలంలో ఏ పంచాయతీలోనైనా ఒక్క ఓటు మెజార్టీ తెలుగుదేశం పార్టీకి వచ్చిన వైసిపికి రాజీనామా చేస్తామన్నారని అందుకు విలువనిచ్చి నైతిక విలువలు ఉంటే వైసిపి నాయకులు రాజకీయ సన్యాసం చేయాలని బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల నేతలు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వస్తే పార్టీకి రాజీనామా చేస్తానన్న నాయకుడు నైతిక విలువలు పాటించి రాజకీయ సన్యాసం చేయాలని తెలిపారు. మండలంలో నైతిక విలువలు పాటించే నాయకులు ఉన్నారని ప్రజలకు తెలియాలంటే రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటాలన్నారు. సమావేశంలో నేతలు కాండ్ర రఘురాం నాయుడు, ఎన్నా బత్తిన వెంకటేశ్వర్లు, లక్కాకుల మాధవరావు, ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, లేళ్లపల్లి సుధీర్ బాబు, రావి విజయ్, తిరుమలశెట్టి ధన్యాసి శ్రీధర్, అస్లాం భాషా, ఎస్ కె రఫీ, అఖిల్, మండల నేతలు పాల్గొన్నారు.

టిడిపి ఘన విజయం



ప్రజాశక్తి-మర్రిపాడు : ఆత్మకూరు ఎంఎల్ఎగా ఎన్నికైన ఆనం రామనారాయణ రెడ్డి మద్దతుగా పెగళ్లపాడులో మాజీ సర్పంచ్ శేషం హజారత్ బాబు యాదవ్, జనసేన నాయకులు నాగరాజు యాదవ్, టిడిపి శ్రేణులు, అభిమానులు ఆధ్వర్యంలో దేవాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొని కేక్ కటింగ్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకట్ల వెంకట సుబ్బయ్య, పుచ్చకట్ల శ్రీనివాసులు, యువ నాయకులు చిన్న పుచ్చకట్ల వెంకటేష్, చల్లకొలను వినయ్, పుచ్చకట్ల సుధీర్ పాల్గొన్నారు. పొంగూరు కండ్రికలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గణేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆనం'కు సత్కారం



ప్రజాశక్తి-మర్రిపాడు : ఆత్మకూరు నియోజకవర్గం నూతన ఎంఎల్ఎగా ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం నెల్లూరులోని ఆయన నివాసంలో రాంపల్లి టిడిపి నాయకులు ప్రసాద్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనవెంట నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి కంది మల్లికార్జున రెడ్డి, టిడిపి నాయకులు ఉన్నారు.

'ఆనం'కు శుభాకాంక్షలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల) : ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా నూతనంగా ఎన్నికైన మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి అన్నవారు శ్రీనివాసులు నాయుడు, కొమ్మి రమేష్‌నాయుడులు నెల్లూరులోని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఎన్నికలలో శాయశక్తులా కష్టపడినందుకు వారిని ఆయన అభినందించారు.

నారా లోకేష్‌ను కలిసిన చెంచలబాబు



ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంగళగిరి ఎంఎల్ఎగా ఎన్నికైన నారా లోకేష్‌ను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టిడిసి మాజీ చైర్మన్ పి.చెంచల బాబు యాదవ్ శుక్రవారం ఉండవల్లిలోని చంద్రబాబు నాయుడు నివాసంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడ్డారని 12పైన ప్రభుత్వం ఏర్పడుతుందని అన్ని విధాల సహకరిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ ఆకసంలో పార్టీ నమ్ముకొని పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి రోజులు వచ్చాయన్నారు. ఉమ్మడి ఎంఎల్ఎ కాకర్ల సురేష్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధితోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు.

అంకమ్మ తల్లికి అభిషేకం



ప్రజాశక్తి- కందుకూరు : అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా సూర్య బార్ అధినేత, టిడిపి నాయకులు, శ్రీ అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు శుక్రవారం శ్రీ అంకమ్మ తల్లికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడికిటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీతో గెలవాలని గత ఐదు వారాల నుండి శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా నేడు శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి అభిషేకం నిర్వహించి అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పివిజి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి బావి పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలో ఉన్న బట్టేపాడు బావిని వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. బట్టేపాడు బావి నీటి శాంపిల్ పరీక్షల్లో కలుషిత వ్యర్థాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అత్యధిక మోతాదులో కలుషిత వ్యర్థాలు ఉన్నట్లు తేలడంతో ప్రజలను అప్రమత్తం చేసే దిశగా చర్యలు చేపట్టారు. బావి నీటిలో క్లోరినేషన్ చేసి బావి నీటిని ప్రజలెవరూ తాగునీటిగా వాడకపోవడం మంచిదన్నారు. హెల్త్ అసిస్టెంట్లు ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, ఎమ్మెల్ హెచ్ పి ముషారఫ్, ఎఎన్ఎం భాషమ్మ, పంచాయతీ కార్యదర్శి మోహన్ కిషోర్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రీతి, ఆశాలు కుమారమ్మ, సునీత పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-కందుకూరు : ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు కందుకూరు మండలం కొండికందుకూరు పంచాయతీలోని బోడపాటివారికండ్రికకు చెందిన పలువురు శుక్రవారం మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అదనం అధ్యర్యంలో గ్రామం నుంచి పాదయాత్రగా కొండూరు పల్లె, శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శించుకుని పూజలు చేశారు. మార్గ మధ్యలో కందుకూరులోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మండల అధ్యక్షుడు నార్నే రోశయ్య, నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జ్ ఉన్నం భాస్కర్, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, పార్టీ నాయకులు చెంచురామయ్య, బొడపాటి సుధాకర్, సుబ్బారావు, మహేంద్ర, నిమ్మకాయల రామకృష్ణ, దరిశిగుల మాల్యాద్రి, బత్తుముంతల మాధవ, మాదాల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట గ్రామస్తులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -గుడ్లూరు : టిడిపి విజయానికి కృషి చేసిన కొత్తపేట గ్రామ వాసులందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానంటూ కందుకూరు టిడిపి ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు అన్నారు. కొత్తపేటలో గ్రామస్తులు శుక్రవారం విజయోత్సవ సభను ఎన్ఆర్ఐ హరిబాబు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు ఇంటూరి పై పూల జల్లు కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సంగం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుండి బస్ స్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, దోమ పుట్ట కూడదు.. దోమ కుట్ట కూడదు.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా అధికారి ఖాదర్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి : 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సీతారాంపురం, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగులు, జనుములు, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో 50శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.


ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు

- బట్టబయలైన ముఠాగుట్టు
- నివ్వెరబోయిన అధికారులు


ప్రజాశక్తి-అల్లూరు



ఫోర్జరీ సంతకాలతో జారీ చేసిన ధ్రువీకరణ పత్రం



సబ్ రిజిస్టర్‌కి లిఖితపూర్వకంగా విఆర్‌ఒ రాసి ఇచ్చిన ఫిర్యాదు



అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాల బాగోతం ఒక్కసారిగా బట్టబయ లైంది. అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసి ఎంచక్కా రిజిస్ట్రేషన్‌లతో నడుపుతున్న వ్యవ హారం గుట్టుగా సాగుతుంది. అధికారుల సంతకాల్లో తేడా గమనించిన సదరు సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీ ప్రసన్న అనుమానంతో సదరు అధికారి సంతకాలను పోల్చి చూడడంతో ఈ ఫోర్జరీ సంతకాల వ్యవహారం వెలుగుచూసింది.

అల్లూరు మండలంలో గత కొంతకాలంగా కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నకిలీ రబ్బర్ స్టాంపులను తయారు చేసుకుని సింగపేట, గ్రద్దగుంట, అల్లూరు, నార్త్‌మోపూరు గ్రామాల విలేజ్ రెవెన్యూ అధికారుల పేర్లతో వారి సంతకాలను సైతం ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు దర్జాగా చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో పలు ప్రయివేట్ బ్యాంకులు లోన్లు ఇచ్చే క్రమంలో ఈ ముఠా పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ కోవలోనే జూన్ 5వ తేదీన బుధవారం గద్దగుంట గ్రామంలోని సర్వే నెంబర్ 163 అసెస్మెంట్ నెంబర్ 112 18 అంకణాల ఇల్లు దాని తాలూకా స్థలాన్ని రిజిస్ట్రేషన్‌కు దాఖలు చేశారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు గ్రామ రెవెన్యూ అధికారి సర్టిఫై చేయాల్సి ఉంది. కొనుగోలుదారులు ఫోర్జరీ ముఠాలను సంప్రదించగా ఆ తంతును ఆ ముఠా సభ్యులు చక్కదిద్దారు. గద్దగుంట విఆర్‌ఒ నందం శిరీష గ్రామ కంఠానికి చెందిన స్థలం సదరు వ్యక్తులదని పడమర ఉత్తర దక్షిణాలలో స్థలానికి సరిహద్దులు ధ్రువీకరిస్తూ సంతకం రబ్బర్ స్టాంపులతో కూడిన సర్టిఫికెట్‌ను 17/05/2024 తారీఖున జారీ చేసిన సర్టిఫికెట్‌ను 05/06/2024 బుధవారం రిజిస్ట్రేషన్‌కు దాఖలు చేశారు. అయితే సదరు గ్రామ రెవెన్యూ అధికారి సంతకంపై అనుమానంతో గతంలో ఉన్న అదే గ్రామ అధికారి సంతకాన్ని సరిపోల్చి చూసిన సబ్ రిజిస్ట్రార్ అనుమానం నిజమైంది. దాంతో తదుపరి ప్రాసెస్‌కు వెళ్లకుండా ముందు జాగ్రత్తగా గ్రామ రెవెన్యూ అధికారి శిరీషకు విషయం తెలపడంతో విఆర్‌ఒ 06/06/2024 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఈ సంతకం రబ్బరు స్టాంపు తమది కాదని ధృవీకరించి ఫోర్జరీగా తేల్చి ఈ అంశాన్ని లిఖిత పూర్వకంగా సబ్‌రిజిస్ట్రార్‌కు రాసి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని కోరింది. పైగా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది. విషయం బయటకు పొక్కడంతో ఫోర్జరీ ముఠా చకచకా పావులు కదిపి విఆర్‌ఒపై తీవ్ర ఒత్తిడి తెచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా నివారించగలిగారు. ఆ నోట.. ఈ నోట.. విషయం పొక్కడంతో పలు గ్రామాల నుంచి ఇలాంటి ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయా.. అని గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీసులకు తన సంతకం ఫోర్జరీ విషయం ఫిర్యాదు చేయకుండా ఉండేందుకు కొంత మొత్తాన్ని సదరు అధికారికి ముట్ట చెప్పినట్లు ప్రజలు చెవులు కోరుకొంటున్నారు.

ఈ ఫోర్జరీ ముఠాలో అల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో ఒక వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు తంతు నడుపుతున్న ప్రయివేటు వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి బాగోతాలను వెలికి తీసి సదరు అధికారులు సంతకాలతో రిజిస్ట్రేషన్లు నడుపుతున్న వారి భరతం పట్టాల్సి ఉంది.

ఫిర్యాదుపై విఆర్‌ఒను వివరణ కోరగా.. తాను ఆటోలో ఉన్నానని, మళ్లీ చేస్తానని అన్నారు. మళ్లీ వివరణ కోరగా మీకెందుకు అన్నట్లుగా ఫోన్ కట్ చేశారు.



చంద్రబాబుకు పూలబొకే అందజేస్తున్న కాకర్ల కుటుంబసభ్యులు

చంద్రబాబును కలిసిన 'కాకర్ల' దంపతులు

ప్రజాశక్తి-ఉదయగిరి

జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడును శాసనసభ్యులు కాకర్ల సురేష్ - ప్రవీణ దంపతులు వారి కుమార్తె కాకర్ల ధాత్రితో కలిశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమరావతిలోని నారా చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి, నారా చంద్రబాబు నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. మెట్టప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని, ఉదయగిరిని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని, ఉదయగిరిలో పసుపు జెండా శాశ్వతంగా ఎగరాలని, కాకర్లకు నారా చంద్రబాబు నాయుడు సూచనలు ఇచ్చారని తెలిపారు. వైసిపి కోటకు బీటలు కొట్టి రికార్డు సృష్టించినందుకు చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారన్నారు.




సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నేతలు

'కాకర్ల' విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

శాసనసభ్యులు కాకర్ల సురేష్ విజయోత్సవ సంబరాలను మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వాడవాడల ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మెయిన్ బజార్ మార్కెట్ సెంటర్లో యువ నాయకులు బాబు ఏర్పాటు చేసిన విజయోత్సవ సంబరాలలో కేకును కట్ చేసి డీజేతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు యువ నాయకులు బాబు, మట్ల రామయ్య లక్ష్మయ్య బ్రదర్స్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కాకర్ల విజయం సాధించడం ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేయడం ఈ ప్రాంత అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఉదయగిరి మెట్టప్రాంత అభివృద్ధి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితోనే సాధ్యమని నియోజకవర్గ ప్రజలు నమ్మి వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. 40యేళ్ల చరిత్రను తిరగరాస్తు కాకర్ల సురేష్ ఉదయగిరి ప్రాంత అభివృద్ధి చేసి చూపుతారని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగేళ్ల రవి, హర్ష నారాయణ, ఖాజా, కాకి రమణ, టిడిపి, జనసేన నాయకులు, పాల్గొన్నారు.



కావ్య క్రిష్ణారెడ్డికి కమిషనర్ సత్కారం

ప్రజాశక్తి-కావలి

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎంఎల్ఎగా పోటీచేసి గెలుపొందిన గౌరవ కావ్య క్రిష్ణారెడ్డిని గురువారం రాత్రి కావలి పురపాలక సంఘ కమిషనరు జి.శ్రావణ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.సాయిరాం, పురపాలక సంఘ సిబ్బంది సాదరంగా కలిసి అభినందనలు తెలిపి గౌరవంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు విషయాలను వారు చర్చించుకున్నారు.



ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

యుద్ధప్రాతిపదికన తాగునీటి ఏర్పాట్లు

ప్రజాశక్తి-కావలి

తనకు ఓట్లు వేయలేదన్న కోపంతో మాజీ ఎం.ఎల్.ఎ. మున్సిపాలిటీలో వాటర్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న తన అనుచరుల ట్యాంకర్లను ఆపు చేయించడంతో, విషయం ప్రజలు కొత్త ఎం.ఎల్.ఎ.గా గెలిచిన కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. యుద్ధ ప్రాతిపదికపై తన సొంత నిధులతో కృష్ణారెడ్డి ట్యాంకర్లు ఏర్పాటు చేసి, వైకుంఠపురం పెంకులు ఫ్యాక్టరీ, హరిజనవాడ, అరుంధతీయవాడ, బాలకృష్ణారెడ్డి నగర్ ప్రాంతాలకు నీటి సరఫరా అందిస్తున్నారు. ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి చొరవతో సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కావలిరూరల్



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక కసాయి వీధిలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి, కందుకూరు నియోజకవర్గాల సిఐటియు నాయకులు పాల్గొని మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో అంగన్‌వాడీలు చేసిన పోరాట ఫలితంగా అప్పటి ప్రభుత్వం జూలై నుండి జీతాలు పెంచుతామని హామీనిచ్చి గెజిట్‌లో కూడా ఈ అంశం రాయటం జరిగిందని, దానిని అమలు చేయాలని కూడా కోరారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు షేక్ రెహానాబేగం, నాయకులు కందుకూరు నియోజకవర్గం నుండి ఎస్‌కె గౌస్, జి వెంకటేశ్వర్లు, కె వెంకయ్య, ఎస్ డి గౌస్ బాషా, కావలి నియోజకవర్గం నుండి పి పెంచలయ్య, తుమ్మల వెంకయ్య, టి మాల్యాద్రి, ఒంటేరు సుధాకర్, ఎం మహేష్, ఎస్ కె రషీద్, కె విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో విద్యార్థులు, యువత గ్రంథాలయాలు సందర్శించి పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదను పెంచుకోవాలని కావలి న్యాయస్థానాల అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) మృదుల పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని కావలి పట్టణంలోని వెంగళరావు నగరశాఖా గ్రంథాలయంలో ముగింపు సందర్భంగా శుక్ర వారం ఎపిపి మృదుల విచ్చేసి ఈ శిబిరంలో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వెంగళరావు నగర్‌లో జరిగిన విజ్ఞాన శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను సెలవు దినాల్లో గ్రంథాలయాలకు పంపి సామాజిక విజ్ఞానాన్ని, మరీ ముఖ్యంగా పోటీ పరీక్షల్లో పాల్గొని ఉద్యోగాలు సంపాదించడానికి ఈ గ్రంథాలయాలు ఎంతగానో



బహుమతులు అందజేస్తున్న ఎపిపి మృదుల

తోడ్పడతాయన్నారు. అన్ని రకాల గ్రంథాలు పుస్తకాలను పట్టణ ప్రజలు ఖాళీ సమయాల్లో సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి ఎస్.సునీత మాట్లాడుతూ పాఠ కులు తరచుగా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, గ్రంథాలు, పురాణాలు, చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివి మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో లెక్చరర్ మంజుల, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-అనంతసాగరం



మండలం అగ్రహారంకు చెందిన అక్కల రెడ్డి భాస్కర్ రెడ్డి, ఉషా దంపతులు రెండో కుమార్తె అక్కల రెడ్డి మనస్విత నీట్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచింది. 720 మార్కులకు గానూ 700 మార్కులు సాధించి ఆల్ ఇండియా పరిధిలో 1689 ర్యాంక్ కైవసం చేసుకున్నది. ఈ సందర్భంగా అక్కల మనస్విత మాట్లాడుతూ కష్టపడి చదివి ఎంబిబిఎస్ పూర్తిచేసి ఎంఎస్ చదివిన తర్వాత పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు. మనస్వితకు ర్యాంకు రావడంపై విద్యార్థి చదివిన శ్రీ చైతన్య యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, బంధువులు ప్రత్యేకంగా అభినందించారు.



కావ్య క్రిష్ణారెడ్డికి మాలేపాటి అభినందనలు

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు సమక్షంలో దగదర్తి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో శుక్రవారం కావలిలో కావ్య స్వగృహానికి చేరుకొని కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. భారీ కేకును కట్ చేసి, పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు ఇస్తూ, జై తెలుగుదేశం.. అంటూ నినాదాలు చేశారు.

కొత్త ప్రభుత్వం హామీలు నేరవేర్చాలి

ప్రజాశక్తి-కందుకూరు




మాట్లాడుతున్న ఎంఎల్‌సి తూమాటి


ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి కృషి చేయాలని శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు కోరారు. కందుకూరులోని తన నివాసంలో శుక్రవారం మాధవరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు వేల రూపాయల పెన్షన్‌తో పాటు ఉచిత సిలిండర్లు ,బస్సు ప్రయాణం తోపాటు వివిధ హామీలు కూటమి నేతలు ఇచ్చి ప్రజల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం కలిగిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ఏమాత్రమూ వెనకాడినా వారికి మద్దతుగా తాము నిలుస్తామని చెప్పారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని ఇంటూరి నాగేశ్వరరావు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రజలకు అనుకూలంగా కూటమి తీసుకునే నిర్ణయాలకు తమ మద్దతు ఉంటుందని ప్రజా వ్యతిరేక చర్యలపై పోరాడుతామని చెప్పారు.రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకు రావడానికి కూటమి కృషి చేయాలన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసిన పొరపాట్లను సమీక్షించుకొని మళ్లీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం తో పాటు రామాయపట్నంలో పోర్టు నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూ సేకరణ వరకు కార్యక్రమం జరిగిందని ,మాలకొండ వద్ద నిమ్జ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని తెలిపారు. కందుకూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని కార్యకర్తలు అధైర్య పడవద్దని మాధవరావు చెప్పారు. కార్యకర్తలకు పూర్తిస్థాయిలో తాము అండగా నిలుస్తామని ఎలాంటి సమస్య వచ్చినా వారికి మద్దతు ఇస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ వారు వైసిపి శ్రేణులను ఇబ్బందులు పెడితే తాము చూస్తూ ఊరుకోమని వారికి అండగా నిలుస్తామని తెలిపారు. మళ్లీ అధికారంలోకి రావడానికి కావాల్సిన పోరాటాలను వైసిపి చేస్తుందని తెలిపారు.

'కాకర్ల'కు మెట్టుకూరు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలిగిరి



ఉదయగిరి కోటపై తెలుగు దేశం జెండా రెపరెపలాడించిన యువనేత కాకర్ల సురేష్ కాకర్ల ప్రవీణ దంపతులకు మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, శిరీష దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు దంపతులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాకర్ల సురేష్ గెలుపులో కీలక పాత్ర పోషించిన మెట్టుకూరు చిరంజీవి రెడ్డి ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌లు విజయవాడలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ సహకారంతో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయగిరిని సిరులగిరిగా చేసేందుకు కలిసి పోరాటం చేద్దామని చర్చించుకున్నారు. కలిసికట్టుగా పనిచేస్తే విజయం ఈ విధంగా ఉంటుందని, ఉదయగిరి వైసిపి కోటకు బీటలు కొట్టడం సాధ్యమైందని, శాశ్వతంగా ఉదయగిరి కోటపై పసుపు జెండా ఎగరాలని దానికోసం అందరం కలిసి పని చేద్దామన్నారు. ఆత్మీయ సమావేశంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుమార్తె కాకర్ల ధాత్రి, చిరంజీవి రెడ్డి కుమార్తె తదితరులున్నారు.



విలువలతో కూడిన విద్యను అందిస్తాం..

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తాం అని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల దాసరపల్లి ప్రధానోపాధ్యాయులు పఠాన్ సాబీరాబేగం, ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఒకటవ తరగతి ఐదవ తరగతి చేరబోవు విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించండి వారికి అన్ని వసతులతో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తాం అని వీళ్ళ తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి వెళ్లి నూతన అడ్మిషన్లు నిర్వహించారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీ కొన్న ఆర్‌టిసి బస్సు

- వ్యక్తి మృతి, ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-కావలి

కావలి మండలం, రుద్రకోట సమీపంలో 16వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి "స్పైసీ హబ్ "డాబా సమీపంలో కావలి వైపునకు పోతున్న ఎన్ ఎల్ క్యూ -10-4430 నెంబరు గల కంటైనర్ లారీ ఒక్కసారిగా ఆగేసరికి, ఆర్.టి.సి.బస్సు డ్రైవరు బస్సును కంట్రోల్ చేసుకోలేక లారీ వెనుక ఢీ కొనడంతో, సదరు ప్రమాదంలో బస్సులో నుంచి చెన్నయ్య (55) అనే వ్యక్తి కింద పడిపోయి బలమైన దెబ్బలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్‌లో ఉన్న మృతుడి భార్య వెంకట లక్ష్మీ, కుమార్తె కోటీశ్వరికి మరో 5 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. చెన్నయ్య భార్య వెంకటలక్ష్మి రిపోర్టు మేరకుకావలి రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రకాశం జిల్లా, తర్లుపాడు మండలం, సీతా నాగులవరం గ్రామానికి చెందిన మృతుడు తుంపాటి చెన్నయ్య తన భార్య లక్ష్మీతో కలిసి కులవృత్తి చేసుకొని జీవిస్తున్నట్లు, వారికి ఇద్దరు ఆడపిల్లలు సంతానమైనట్లు, మొదటి కుమార్తె గౌరీలక్ష్మిని కావలిలోని పాతూరుకు చెందిన కుమార్‌కు ఇచ్చి పెళ్లి చేసి ఉండగా, మృతుడు చెన్నయ్య, అతని భార్య వెంకటలక్ష్మీ, కుమార్తె కోటేశ్వరీ, మేనల్లుడు బాలకాశి కలిసి, తన కుమార్తెను చూడడానికి గురువారం మార్కాపురం నుండి ఎపి 27 జెడ్ 0254 నెంబర్ గల ఆర్‌టిసి బస్సు ఎక్కి కావలికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలియజేశారు.

ఎంఎల్‌సి తూమాటి వ్యాఖ్యలు హాస్యాస్పదం

- కందుకూరును ప్రకాశంలో కలిపే బాధ్యత టిడిపిదే ..
- తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్

ప్రజాశక్తి-కందుకూరు



ఒక్క అవకాశం ఇవ్వండి కేంద్రం మెడలు వంచి ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా తెస్తా, కేంద్రం ప్రభుత్వ మెడలు వంచుతా అని ప్రగల్భాలు పలికి 22 ఎంపిలు, 151 శాసన సభ స్థానాలతో అధికారం లోనికి వచ్చాక ఆ ఊసే జగన్మోహన్‌రెడ్డి ఎత్తలేదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ తెలిపారు. వైకాపా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదా కోసం కేంద్రం తో పోరాడి సాధించాలి అనడం హాస్యాస్పదం గా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌హన రెడ్డి మోస పూరిత హామీలు, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి, రాష్ట్ర ఖజానాను లూఠీ చేసి, కనీసం ఒక డిఎస్‌సి కూడా విడుదల చేయకుండా యువత కు ఉద్యోగాలు లేకుండా చేసి అన్యాయం చేశారన్నారు. ఇవన్నీ ఐదు సంవత్సరాలు భరించిన ప్రజలు జగన్ కి తగిన గుణపాఠం చెప్పి, రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే, రాజధాని నిర్మించాలంటే ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉండాలని అత్యధిక మెజారిటీ తో గెలిపించారన్నారు.ఈ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి ఏమి తీసుకురావాలి అనే విషయం పై చంద్రబాబు కు స్పష్టమైన అవగాహన ఉందనే ప్రజలు ఆయనను గెలిపించారన్నారు. ఆయన తప్పక రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి న్యాయమైన హక్కులు సాధిస్తారన్నారు.

కందుకూరు ను ప్రకాశం జిల్లాలో కలిపేది టిడిపియే

కందుకూరు నియోజక వర్గ ప్రజలు అందరూ ముక్త కంఠంతో ప్రకాశం జిల్లాలోనే ఉంటామని, నెల్లూరు జిల్లా లో కలిపి అన్యాయం చేయొద్దని దాదాపు 2 నెలలు ఎప్పుడూ లేని విధంగా సుదీర్ఘ పోరాటం చేశామన్నారు. ఆ విషయాన్ని కనీసం పట్టించుకోకుండా, ఆ రోజు జగన్ ప్రాపకం కోసం వేచి చూసిన కందుకూరు వైకాపా ప్రజా ప్రతినిదులు కందుకూరు ను ప్రకాశం లో కలపాలి అని అనడం హాస్యాస్పదం గా ఉందన్నారు., స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి ప్రజల కు న్యాయం చేస్తారన్నారు.